ఎమ్మెల్యేకాక ముందు ఏ వెధవ పనులు చేసి.. మళ్లీ మొలవకుండా ప్రజలచేత నెత్తి మీద జుత్తు పీకించేసుకున్నాడో కాని ఆయన బుర్ర బోర్లించిన యిత్తడి చెంబులాగే ఉంది అచ్చంగా . ఎమ్మెల్యేకి ఎక్కడ క్షవరం చేయాలో తోచక కంగారుపడిపోతూ మనసులో మాట బయటకు అనేసాడు దుర్గారావ్. "మంగలి షాపుకి మంత్రిగారి ప్రారంభోత్సవం. మరి మరుగుదొడ్డికి మీరొచ్చి తాడు కోస్తారా ?" ఎమ్మెల్యే అంగీకార సూచకంగా నవ్వునవ్వాడు. అతనేమడిగాడో తెలియకుండానే ఎమ్మెల్యేకి బట్టతలే కాక బ్రహ్మ చెముడు కూడా ఉండడం వలన దుర్గారావ్ క్షేమంగా మిగిలాడు.

(మనవి : ఈ రచనలో తప్పని సరయికులాల పేర్లు ప్రస్తావించవలిసి వచ్చినందుకు రచయిత క్షమార్హుడు.)

---

# గిన్నిబుక్కు

ఆవేళ రఘుచంద్ర యింటికి వచ్చేసరికి –

" ఇవాళ కాఫీ కప్పుకి ముందు ఒక ప్రతిపాదన ఉంచుతున్నాం మీ ముందు" అందతని భార్య.

"మీరు తప్ప మిగిలిన కుటుంబ సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా చేస్తున్న ప్రతిపాదన ఇది. తెలుగు మీడియం అనిపించుకున్నాడు పెద్ద కొడుకు. "దీనిని మీరంగీకరించి తీరాలి" శాసిస్తున్నట్లే అన్నాడు చిన్నారి. చిన్న కొడుకు కదాని చిన్నారనడంకాని, నిజానికి వాడు అతనికి పెద్ద బలవంతుడైన శత్రువు. రఘుచంద్ర శ్రీమతి సూర్యకాంతానికి – 'చిన్నారికి తన పోలికలొచ్చాయి. కనుక వాడు విపరీతమయిన తెలివైన వాడని నమ్మకం.

రఘుచంద్ర మంచివాడు. తెల్లనివన్నీ సారా అనీ, నల్లనవన్నీ సిరా అనీ నమ్మేవాడు. ప్రభుత్వం ఇద్దరు ముద్దు – ఆపైవద్దు అంటే ఇద్దరితోనే సరిపెట్టుకుందామనుకున్నాడు నిజమైన దేశ సేవకుడిలా, అక్కడికి పిల్లల్ని కనడం తన వొక్కడి డిపార్ట్‌మెంటే అన్నట్టు.

"ఛ! తోటికోడలుకిద్దరు " అంది శ్రీమతి.

'మనకీ యిద్దరేగా ! నువ్వు పరాకున పడి మరిచిపోయినట్లున్నావ్..కధల్లోలా ఎంచక్కా ఓ అబ్బాయి, అమ్మాయి.."

"ఆడపిల్ల మైనస్సు. పిల్లల్లోకి లెక్కరాదు. తోడికోడలికిద్దరూ మగపిల్లలే. నాకూ యిద్దరూ మగపిల్లలుండకపోతే నాముందా విడ మిడిసిపడి పోదూ !" అరిచింది. మొగుడు కొట్టినందుక్కాదు తోటికోడలు నవ్వినందుకే డ్చిందట అన్న నానుడి జ్ఞాపకమొచ్చింది రఘుచంద్రకి. ఆడవాళ్ల కోరికలు పక్కింట్లోంచీ ఎదురింట్లోంచీ పుడతాయన్న మాట గుర్తుకువచ్చింది.

"అదికాదు పున్నామ నరకంనుంచి తప్పించేవాడు పుత్రుడని – పాతకాలం మాట. పుట్టినప్పటి నుంచీ తల్లితండ్రులని త్రాహిత్రాహి అనిపించేవాడు పుత్రుడని నేటి అర్ధం. అదీగాక మగపిల్లడే పుడతాడని గ్యారంటీ లేదుకనుక.... ఎందరిని కంటూపోతాం ? పాలకోసం

రాళ్ళని.. అహ కొడుకు కోసం కూతుళ్ళని మోసినట్లవుతుందేమో" దయచేసి ఆలోచించ మన్నట్లు ప్రాధేయపడ్డాడు. చిలక్కి - ఆహ సింహానికి చెప్పినట్లు భయంగా బతిమాలుతూ చెప్పాడు భార్యకి. " మీరే గంగలో ఐనా దూకండి. నేను మాత్రం రెండో మగ పిల్లాణ్ణి కనేంతవరకూ ఊరుకునేది లేదు." మంగమ్మలా శపథమే పూనింది అర్ధాంగి. ఆవేశం మీదుంది. ఇంక ఆలోచనెలా ఉంటుంది. ' ఆలోచనే ఉంటే మీరు గంగలో దూకినా నేను కొడుకుని కనడం మానేది లే' దని అనగలదా ? అదిగో అలా - రఘుచంద్ర అభీష్టానికి వ్యతిరేకంగా జన్మించాడు చిన్నారి. వేదిక మీది వేషాలే తప్ప నిజంగా భర్తకి భార్యముందు అధికారికి గుమస్తాల ముందూ ఉండేదున్నన్న పవరేముంది?

ఇప్పుడు ప్రతిపాదనంటూ ఆ మాత్రమైనా గౌరవం యిస్తున్నందుకు నిజానికి పొంగిపోవాలి

" ఏమిటీ ప్రతిపాదన"

" మన ఇంటికి అర్జెంటుగా ఒక టి.వి.రావాలి. ఎదురింటి వాళ్ళకి నిన్ననే వచ్చేసింది. పక్కింటి వాళ్ళకి ఎల్లుండి వచ్చేస్తుంది. మీరు మీ పరువు వాళ్ళ కంటే ఏమీ తక్కువ కాదనీ గబగబ నిరూపించేసుకోవాలి. ఆలస్యం పరువు నష్టం కదా ?"

" టీవీయా" గుండె గుభేల్మంది రఘుచంద్రకి

" ఆహా, టి.వి.యే మేమేం వి.సి.పి. తెమ్మనడం లేదు."

" అది కాదు టీవీని ఇడియట్ బాక్స్ అంటారు" నీళ్ళు నమిలాడు.

అది ఇడియట్లనే మాట. మీరలాటివి పట్టించుకోకండి. నలుగురితో పాటు నారాయణ. ఇవాళా రేపూ టివీలేనిల్లు ఇల్లూ కాదు. వాళ్ళు మనుషులూ కారు.

"ఔనౌను కానీ టివీని ద్వాదశగ్రహం అంటారు. ద్వాదశి దగ్గయోగమని పంచాంగం. పిల్లలచదువులూ.. ఇల్లాలి మానసికారోగ్యమూ దగ్ధం చేస్తుందని"

"కంప్యూటర్ యుగంలో పంచాంగాలంటారేమిటి? మీరు మరీ యింత వెనుకబడి ఉండకూడదు." టీవీ లేకపోతే కల్చరేలేనట్లు. నొక్కి వక్కాణించింది నారీమణి. "మీ ఇష్టం అనే సాడు రఘుచంద్ర.

"మీరు ఒప్పుకున్నట్లేగా మంచివారు, తెలివైనవారు అంటూ కాఫీ తెచ్చిందామె. తను టివికి నో అంటే ఆవిడ కాఫీ కూడా నో అనేసేదేమో అని అనుమాన మొచ్చిందతనికి కాఫీ తాగాక బుర్ర వికసించనట్లయి" టీవీ తప్పకుండా కొందాం. కానీ కొన్ని షరతులు.." అన్నాడు.

"ఏమిటి?

" సీరియల్ కోసమో సినిమా కోసమనో వంటకెగనామం పెట్టకూడదు. రెండు పిల్లల చదువు వేళలో టీవీ పెట్టరాదు. రోజులో కనీసం ఆరుగంటలపాటైనా యింటికీ టీవీకి విశ్రాంతినిస్తూ ఉండాలి."

అంతే.. ఆ మాత్రానికే ఆవిడ నెత్తిమీద కుండలనీళ్లు కళ్ళలోకి దింపేసుకొని నయాగరా.. జోగ్.. మొదలయిన జలపాతాలని కురిపించేస్తూ కాంతా కరవాలం (చీపురుకట్ట) కాక వారుణాస్త్రమే ప్రయోగిస్తున్నందుకు పిల్లల

ముందు ఆ మేరకు పరువు కాపాడినందుకు గుడ్డిలో మెల్ల అనుకొని సంతోషిస్తూ, ఆమెగారి ధోరణికి తలొగ్గాడు.

"ఆడదాన్ననీ.. వంటింటి కుందేలుననీ పడకటింటి పందిననీ.. పిల్లల్నికనే యంత్రమనే గా అలా చులకన చేసే షరతులు పెట్టారు?" సూటి ప్రశ్నవేసింది ఏడిచేస్తూనే. అతను భయపడుతూనే సంజాయిషీ ఇచ్చుకున్నాడు. "పేరుకే మూడు కాని, నీకు వర్తించే షరతు మొదటి దొక్కటే. బంగారవు కత్తి అని పీకకోసుకోనట్లే కలర్‌టీవిలో ప్రోగ్రామ్ కదాని కడుపులో కాళ్ళు పెట్టుకు పడుకుంటే కడుపు చేటూ పరువు చేటూ కదా ! పోతే – భార్యగారూ ! నా మాటలకు మీరింతగా ఫీలైపోతూ వాటర్‌ఫాల్స్ సృష్టించనక్కరలేదు. పురుషుడు కార్యాలయంలో కుందేలు. కిచెన్ కుందేలయినా ఆఫీస్ కుందేలయినా ఏ రాయయితేనే తల పగలుగొట్టేందుకు ! ఆడది పడకింటి పందయితే – మగాడు పడకింటి మగ పంది. స్త్రీ పిల్లల్ని కనే యంత్రమయితే పురుషుడు ఆ యంత్రానికి చోదకుడు స్త్రీ పనిమనిషయితే పురుషుడు మనీమెషిన్.."

" మీ చింతకాయ చెట్నీ వాదనలు బోరు కొడుతున్నాయి. పాతడైలాగులు. మమ్మీ ఎలాగూ అంతిమ విజయం నీదే కనక అడ్వాన్స్ కంగ్రాట్స్. సారీ డాడీ! నువ్వొటి ఇండియన్ క్రికెట్ టీమ్‌లాండివాడివి. జన్మలో గెలుపనేది ఉండదు నీకు. మీ వాదనల గేమయ్యాక రెడీ ఐతే షాపింగ్‌కెళ్దాం సోలాంగ్" అనీ పక్కగదిలోకి పోయారు పిల్లలు, ఉపహూ పిడుగులు.

అది వాళ్ళ తప్పుకాదు. మొగుడు ముండా అంటే ముష్టివాడూ ముండా అనే అంటాడట. పెళ్ళాం చేత లెక్కచెయ్యబడనివాడు పిల్లలు చేత గౌరవింపబడతాడా ! చివరికి ఆడపిల్ల కిన్నెర కూడా ఆ సజ్జులో చేరిపోయిందన్నమాట ఔను మరి. ఆ తానులోదే కదా యీ ముక్కాను. నిట్టూర్చాడు రఘుచంద్ర.

సరే. మిమ్మల్ని మీరు పందన్నారు. కనుక మీ ఆత్మ జ్ఞానానికి సంతోషించి టీవీ కొనడానికొప్పుకుంటున్నాను. చీర మార్చుకొని అరగంటలో వొచ్చేస్తా. ఈలోగా ఆటో తెండి. అట్నించెలాగూ టీవీ ఉంటుంది కదా !

అతను వెర్రి మొహంవేశాడామె ప్లేటు ఫిరాయింపుకి. టీవీ కొనమని ఆవిడడిగిందా ? తనడిగాడా ? అట్నించిటు బలే తిరగేసిందే అట్టుకిమల్లే! ఆడదికదా !

ఎంతజీతమొచ్చే ఉద్యోగిదయినా వాయిదాల బతుకే. వాయిదాలకి అందని వస్తువుండదు. సూర్యకాంతం ప్రిస్టేజ్ తీరే వేరు. పనిమనిషి కట్టిన చీర రంగుది తన కట్టిందో పరువు పోయిందే. పనిమనిషెళ్ళిన సినిమాకి వెళ్ళక పోవడంలోనే తన గొప్పతనం నిలబడుతుందని ఆవిడ సిద్ధాంతం ఆల్‌రైట్. అనుకోకుండా ఏంచేయగలను ఆఫ్టరాల్ మొగాణ్ణి, మొగుణ్ణీ అనేసుకున్నాడతను.

స్త్రీకి శారీ కట్టిందే షాపింగ్ కదా ! అరగంటలో.. ఆటోలో ..సులభవాయిదాల పద్ధతిపై సర్వసామాగ్రీ యిచ్చే తెలిసిన షాపు చేరుకున్నాడు రఘుచంద్ర. టీ.వీ. ఆవిడే ఎంపిక చేసింది. కలర్‌టీవీకి కలరాంటీనా లేకపోతే పైవాళ్ళకి మాది కలర్ టీవీ అని ఎలా తెలుస్తుంది. అని సణిగింది. రిమోట్ కంట్రోల్‌ది

తీసుకుంది. వాయిదాల పద్ధతిగా అని ధీమా.

గేదెను కొని కన్నె (తాడు)కి కక్కుర్తి పడతామా అని స్టార్..కేబుల్..వగైరా హంగులు కూడా అమర్చేయమంది షాపువాడినే. ఆ రాత్రి మంచి ముహూర్తమని తొమ్మిదిన్నరకి టీవీ ఆన్ చేసింది. అప్పుడామె ముఖంలో గర్వమూ ఆనందమూ.. వెయ్యి వీడియోలయినా తియ్యలేవేమో!

టీవీ వచ్చిన వేళా గొడ్డొచ్చినవేళా అనిట కొత్త సామెత. టీవీ వచ్చిన వేళా విశేషం కాబోలు యింట్లోనూ మనుషుల్లోనూ చాలా మార్పులు వచ్చి పడసాగాయి.

అంతవరకూ అరువు టీవీ చూసినా వార్తలకోసమే. అలాటిదిప్పుడతను ఆటల పిచ్చెక్కించుకున్నాడు బాలస్తావతు క్రీడా సక్తః అన్నదాన్లో.. ఆటలాడడంలో పిల్లలకీ ఆటలు చూడడంలో పెద్దలకి ఆసక్తి - అని అర్థం చూస్తున్నాడు. విచిత్రంగా అతనికి హాకీ వెర్రిపట్టింది. హాకీ మ్యాచుందంటే డొమెస్టిక్ ప్రాబ్లెం. అని లీవు పెట్టేస్తున్నాడు. హాకీ ఆట 'స్టిక్' తో ఆడేది. డొమెస్టిక్ అంటేనే ప్రాబ్లమ్స్ కనుక తను అనృత దోషానికి పాల్పడనట్లే అని ఆత్మవంచన కూడా చేసుకుంటున్నాడు.

తాను చేలో మేస్తూ దూడలని గట్టున మేయమని ఆవు చెప్పడానికే జంకుతుంది. చెప్పినా దూడలు వినమూ వినవు. యథాపెద్దలు తథా పిల్లలు కదా ? తండ్రి హాకీ, తల్లి టీవీ సీరియాలూ చూస్తూంటే పిల్లలు పుస్తకాలు తీస్తారా?

మన ఇండియన్ క్రికెట్‌టీమ్ ఎప్పుడేనా ఏ విదేశీటీమునయినా గెలుస్తుందా అనేది మిలియన్ డాలర్ క్వశ్చన్. దానికాన్సరు కోసం చూస్తున్నాం." అంటూ వాళ్లూ క్రికెట్ మ్యాచ్‌లు చూసేందుకు బడులెగ్గొటెస్తున్నారు.

"బడికి పొంద్రా బడుగ్గాయిలు" అని అతను కేకలేద్దామనుకున్నా " తమరు ఆఫీసుకెళ్ళండి పెద్ద బడుగ్గాయిగారు'' అని భార్య తనమీదకి దండయాత్ర చేస్తూందేమో అని అతని జంకు. అతనికి స్వయం ప్రకాశం లేదు. ఎలా ఉంటుంది. అతను పెళ్ళయినవాడు. ఆమె పేరులో సూర్యుడు. అతని పేరులో చంద్రుడూను. సూర్యుడుండగా చంద్రుడూ ? సీనులో భార్య ఉండగా భర్తా కనిపించజాలరు కదా?

మొత్తానికి టీవీ వచ్చిన అనతికాలంలోనే ఆ యింటికీ వాళ్ళకీ టీవీ ఫీవరొచ్చేసింది. టీవి కల్చరలవడిపోయింది. "కలర్ టీవీ రిమోట్ కంట్రోలున్న వాళ్ళింట్లో నా పని అంటూ వాళ్ళ పనిమనిషి కూడా గర్వంగా చెప్పుకుంటూందని విని సంతోషం పట్టలేక వి.సి.పి. ఇన్వర్టర్ వగైరాలను కూడా వాయిదా పద్ధతుల మీద కొనాలని ఆలోచిస్తున్నారు. ఐతే ఒక్కొక్కప్పుడు టీవీ వాళ్ళని అగ్నిపరీక్షలకి కూడా గురిచేస్తూంది.

టీవీ అంటే ప్రొగ్రాములనే ర్యాపర్‌లో ప్రకటనలనే ప్రొడక్ట్ కదా? కార్యక్రమాలనే తీపి పూత పూసిన ప్రకటనల చేదుమాత్రే కదా ? పాలకోసం రాళ్ళు మోసినట్లు సినిమాలు. సీరియల్స్ ఆటల కోసం అడ్డమైన ప్రకటనలూ మోయాలికదా ప్రేక్షకులు ? మరీ ప్రకటనలు మనసుని తినకుండా ఊరుకోవే.

రఘుచంద్ర కుటుంబం.

టీవీ తెరమీద ప్రకటన పోసుకొని వస్తువులు

వస్తువులే కావనీ అవొట్టి పరువుతక్కువనీ కంప్యూటరైజ్డ్ టూత్ బ్రష్. అటోమాటిక్ అన్నం మిక్స్.. అలాటివే వాడుతున్నారు సులభ వాయిదాల పద్ధతిపైకొని. కాని చిక్కేమిటంటే రుచి, వాసన, రంగు, కల 'రుధిర' టీ ప్రకటన వెంటనే సువాసన, రంగు, రుచికల 'మధుర' టీనేవాడడండంటూ రెండో ప్రకటన. మొదటి అజ్ఞ సినిమా తారదయితే రెండో మొహమాటం క్రికెట్ వీరుడిది. ఎవరిమాట వినాలి? వినాలి. ఏ టీ వాడాలి? చిక్కుప్రశ్న కాదూ.?

ఆఫ్‌కోర్స్.. రోజులో ఉదయం మధిర.. మధ్యాహ్నం రుధిర అలా సాల్వ్ చేసుకున్నారు. టీ కప్పులో తుపాన్‌ని. సినిమాలో హీరోయిన్ అక్క విధవైతే సంప్రదాయపు సంకెళ్ళేసేసి గుండు గీయిస్తారు. దర్శకులు గుండు సీన్‌ని గొప్ప డిటైల్డ్‌గా తీసి పరిపూర్ణ గుండుని ఫ్రీజ్ షాట్‌లో నిలిపేసరికి-వస్తుందొక ప్రకటన సినిమాను కట్‌చేస్తూ. సినిమాలో విగతకేశినే యీ 'శ్మశానవాటికా సుకేశినీ తైలం' ప్రకటనలో దమ్మిడీ అంత మొహమూ ధాన్యం బస్తా అంత జుట్టుతో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. మన స్త్రీ ప్రేక్షకులు-వితంతువై ఈ తైలం రాసుకుంటే నే ఇంత జుత్తుస్తుందేమో, బ్రహ్మాండమైన జుత్తు కోసం భర్తను పోతేమాత్రమే అని అనుకున్నా అనుకోవచ్చు. - అన్నట్లుంటుందా ప్రకటన.

ఒకేసారి సీరియల్, హాకీలు వచ్చి భార్యా భర్తల మధ్య చిచ్చురేపేయి. సీరియల్ అంటుందావిడ, హాకీ అంటాడాయన చివరికి కరెంటు పోయి పరిష్కరిస్తే తప్ప వాళ్ళ కలహం తీరలేదు.

" డాడీ, పాడిగేదె ఎలా పేడ వేస్తుంది? గొంగళి పురుగు ఎలా పాకుతుంది. వంటి విజ్ఞాన విషయాలు చేసి చూపించేదా? టి.వి.లో చూసి నేర్చుకున్నా." అంటాడు చిన్నారి.

షాంపుతో తలంటుకొని జుత్తు దువ్వుకోకుండా సినిమాలో ఆత్మలా విరబోసుకొని ఆ జుట్టు టి.వి. ప్రకటనలోలా ఎగరెడం లేదే అని మనోవ్యాధి పెట్టేసుకుంది కిన్నెర. కొత్త సైకిల్‌ను బండల మీదా కొండల మీదా తొక్కి ఏ కీలుకాకీలు విరగ్గొట్టి తయారు చేసిన కంపెని పరువుతీసి బజారున వేసాడు పెద్దారి. టి.వి.ఉన్న ఇల్లు ఇలాగే ఉంటుందనేసు కున్నాడు రఘుచంద్ర. సరిగ్గా అప్పుడు మొదలైంది టి.విలో ఆ ఫీచర్. నాలుగైదు వారాలు చూశాక గృహ సమావేశం ఏర్పాటు చేయమన్నాడు.

" మరేం లేదు. మనమంతా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చూస్తున్నాం. "

" ఔను. అది భలే బాగుంటుంది."

" ఏదో ఒకటి వెధవ పనైనా చేసి ఆ బుక్‌లోకి ఎక్కకపోతే జీవితం వృధా. అందుకే మనిషి ఒక గంటలో ఎన్ని ఫిల్టర్ సిగరెట్లు కాల్చగలడు. అనే దానిమీద రికార్డు నెలకొల్పి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలనుకుంటున్నాడు. అందుకు మీ సహకారం చాలా అవసరం" అన్నాడు రఘుచంద్ర అర్థవంతంగా.

" దానికేం నేను ఒక స్త్రీ ఒక గంటలో ఎన్ని కొత్తచీరలు మార్చగలదా అనే దానిమీద ప్రయత్నించాలని నిశ్చయించుకున్నాను. దానికి మీరూ చీరల షాపు వాడూ సహకరించాలి.'

" కొత్త చీరలే ఎందుకు పాత చీరలతో

5531 శ్రీకాకుళం

ప్రయత్నించరాదూ?"

" కుదరదు గిన్నీస్ బుక్‌లోకెక్కబోతు న్నదానిని డబ్బు కక్కుర్తితో నా ఉత్సాహాన్ని ఉరితీయకండి. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో సిగరెట్ పెట్టెలు ఇస్తారో, ఇవ్వరో గాని చీరలు మాత్రం ఖచ్చితంగా ఇస్తారు. కొత్త చీరలైతేనే చకచక కుచ్చిళ్లు పోసి కట్టుకోవడం కష్టం."

" ఒకడు ఒకరోజులో ఎందరమ్మాయిలను ఏడిపించగలడనే విషయం మీద నేను ట్రై చేస్తాను." అన్నాడు పెద్దారి.

" నోర్మూయ్ ! అలాంటి వెధవ పనులు చేస్తే, రికార్డు కాదు వీపు బద్దలవుతుంది."

" సిగరెట్లు కాలిస్తే గుండె బద్దలవదా ?"

" ఒక అమ్మాయి ఒక రోజులో ఎన్ని సినిమాలు చూసి స్టోరీలు చెప్పగలదో సాధిస్తాను అంది కిన్నెర." సరిగ్గా అదే క్షణంలో " అమ్మా గిన్నెలెయ్యండమ్మా" అంటూ వచ్చింది పనిమనిషి తోమాలు. " ఏమిటే అంత హడావిడి "

" ముందు గిన్నెలెయ్యండి చెబుతాను. రేపటి నుంచి ఆలస్యం చేయకుండా అంట్లగిన్నెలు రడీగా ఉంచాల నేనొచ్చేతలికి. బకెట్‌తో నీళ్ళు, అంట్లగిన్నెల ప్రక్కన సరపగుండా అన్నీ సిద్ధంగా చేసి ఉంచాలా. గబా గబా గిన్నెలు అట్టుకురండి. ఇవాళ ప్రాక్టీస్ గనక ఫరవాలేదు."

" ప్రాక్టీసేమిటే ! నీమాటలేమి అర్థంకావడం లేదు. నీళ్ళు, వాషింగ్‌పౌడర్ నేను రడీ చేయడమే మిటి. ? " అప్పుడు చెప్పింది పనిమనిషి. " అమ్మా ! అయ్యాగారూ ! నేను రేపు గిన్నిలబుక్కులో కెక్కుతా" "అదేమిటే ! గిన్నెల బుక్కేమిటి తెల్లబోయింది సూర్యకాంతం."

" అదేనమ్మా ! టివిలో చూపుతారు కదా వారం వారం ? కుక్కతోకట్టుకొని గోదావరి ఈదేవాళ్లు, చీపురుకట్టట్టుకొని చకచక ఊడ్చేవాళ్లు, గొర్రెలకి బొచ్చు కత్తిరించేవాళ్లు, టి.వి. పెట్టెలో చూపెడతారు కదామ్మా"

" అదా గిన్నీస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్సా ! దానిలోకి నువ్వెక్కడమేమిటే ? "

" నేను గాక మరెవరికుందమ్మా అది ఎక్కే హక్కు? అసలాబుక్కేటి. గిన్నిలబుక్కు అంటే ఏటి. గిన్నిలెవరెక్కువ బాగా తోముతారు, గంటలో ఎవరు ఎన్ని ఎక్కువ ఇళ్ళల్లో తోమగలరు ? ఎన్ని గిన్నెలు తోమగలరు. అలాంటి పరీక్షల్లో నెగ్గినోళ్ళకే ఆ బుక్కు. అందుకే గిన్నిలబుక్కు ప్రాక్టిస్ బాగా చేస్తానమ్మా. గంటకి 80 వరకు పరపరలాడించేస్తున్నాను. ఇప్పటికి వొరల్డ్ రికార్డు 82 గిన్నెలేనట. అంచేత నేను నా పేరు, నాబొమ్మ గిన్నిలబుక్కులోకెక్కడం గ్యారంటీ. మీటీవిలో మీరే చూస్తారుగా" ముసిముసినవ్వులు నవ్వుతూ తుర్రుమంది తోమాలమ్మ - మరో ఇంట్లో గిన్నిలుతోవడం ప్రాక్టీసు తొందరకాబోలు.

సూర్యకాంతం నోటమాటలేదు. ముఖాన రక్తపు చుక్కలేదు. అన్నీ కోల్పోయినదానిలా వుంది. " ఛీ! పనిమనిషెక్కే గిన్నీస్ బుక్ నేనెక్కుతానా, ఎంత పరువు తక్కువా ! అంది కసిగా." " నేను నీతోపాటే శ్రీమతీ" అనేసాడు రఘుచంద్ర.

" నేను మాతాపితరులననుసరించెద" తెలుగు మీడియం పెద్దారి. " డిటో " కిన్నెర.

" నా నిర్ణయం తరువాత తెలియజేస్తాను" గడుగ్గాయి చిన్నారి.

" మళ్లీ అదనపు వాయిదాలు కట్టే బాధ

తప్పినందుకు ఆనందపడిపోతూ తన గదిలోకి వెళ్లి సిగరెట్ అంటించాడు రఘుచంద్ర.

నేరం పనిమనిషిది కాదు. గిన్నెలబుక్కుదే. పదిమందికి ఉపకారం జరిగే పనులను సాధించి రికార్డు నెలకొల్పినవారికే దానిలో పేరు నమోదు చేస్తానంటే బావుండేది. కాని గోళ్ళు పెంచేవాళ్ళకీ, జుత్తు పెంచేవాళ్ళకీ రోజులు తరబడి ఆపకుండా ఏడ్చేవాళ్ళకీ – అడ్డమైన పనుల వాళ్ళకీ అందులో స్థానమంటే ఇలాగే ఉంటుంది. ఏమైతేనేం పనిమనిషి ధర్మమా అని తమకు వివేకం వికసించింది.

పనిమనిషెక్కుతుందని కదా తను గిన్నీస్ బుక్ ప్రయత్నం మానేసింది సూర్యకాంతం ? పనిమనిషి కాని టి.వి. కొంటే, తన ఇంట్లో టి.వి. ని ఎవరికైనా ఇచ్చేస్తుందా సూర్యకాంతం? పనిమనిషి దగ్గర ఉన్నది తన దగ్గరవుంటే పరువు తక్కువని ? పనిమనిషికి వాయిదాల పద్ధతిలో కలర్ టివి ఇప్పిస్తే, అది తీసుకుంటే ? అలా జరిగితే ఎంత బావుంటుంది. టి.వి.లేని ఇల్లు ఎంత హాయి. సిగరెట్ పీలుస్తూ వెనక్కి వాలాడు రఘుచంద్ర.

- సమాప్తం -

# అమ్మా.. ఆకలీ!

గ్రీష్మమంటే ఉష్ణం, జ్యేష్టమంటే కాష్టం.. అన్న నానుడిని నిజం చేస్తూ మధ్యాహ్నం సూర్యుడు చండ ప్రచండగా వెలిగిపోతున్నాడు. భూమి పెనమై, దానిమీది జీవులు పేలాలై వేడికి వేగిపోతున్నారు. కాని అంత ఎండలోనూ ఆమె అడుక్కోడం మాత్రం ఆశ్చర్యమే.

ఆమెది పగలే వెన్నెలా అనుకోగలిగే పడుచు వయసుకాదు. కనీసం నడి వయసుకూడా కాదు. ఆమె ముదుసలి. శ్రీశ్రీ కవితలోలాటి వృద్ధురాలు, భిక్షుకి ముసలితనం ఆమె నడుముని నిటారుగా నిలువనివ్వక విల్లులా వొంచేసి వొదిలింది. తలను 'చింపిరి ముగ్గు బుట్టగా మార్చేసింది. చేతికర్ర ఊత లేకపోతే అడుగు తీసి అడుగు వేయలేదేమో అన్నట్లే ఉందా అవ్వ. భుజానికో చిన్నజోలె, తిరిపె మెత్తుకు బతికే ఆమె పాదాలకు చెప్పులెలా ఉంటాయి ?లేవు.

"అమ్మా ! దరమం తల్లీ.." దీనంగా.. నీరసంగా బాధగా..

"ఆకలికడుపు మండి పోతూందమ్మ.. అన్నపూర్ణా.." ఆక్రందన.

'మూడ్రోజులయి ముద్దనేదు తల్లీ.. కబళమేయించు కన్నతల్లీ.. ఆ ముసలమ్మకి నిజంగానే ముద్దలేదు మూడు రోజులై కడుపులో ఆకలి. బటటేమో ఎండ. ఎక్కీ గుమ్మం, దీగీ గుమ్మంగా తిరుగుతోంది. ఏ తలుపూ తెరుచుకోవడం లేదు. ఏ తల్లీ పట్టెడన్నం పెట్టడమూ లేదు. అలసిపోయి ఏ క్షణాన శోషొచ్చి పడిపోతుందో అన్నట్లే ఉందా ముదివగ్గు.

"అమ్మా ! తల్లీ.." కంఠంలో వార్ధక్యపు వణుకు. ఆకలి, అలసటల వల్ల నూతిలోంచి గొంతుకలా నీరసంగా..